క్లుప్తంగా

14న రుద్రాభిషేకం

రాయచోటిటౌన్ : ఈనెల 14వ తేది సోమవారం రాత్రి 6-30 గంటల నుంచి మాస శివరాత్రిని పురస్కరించుకొని శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో రుద్రాభిషేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు, ఈవో డీవీ రమణారెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి నెలా మాస శివరాత్రి రోజున సాయంత్రం 6-30గంటల నుంచి రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఈ సోమవారం రోజున ఈ పూజలు నిర్వహిస్తున్నామని కావున భక్తులు విశేషంగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని సూచించారు.

విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేయొద్దు

రాయచోటి అర్బన్: పాలకులు విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేస్తే సహించేది లేదని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు జి.ఈశ్వరయ్య అన్నారు. ఏఐఎస్ఎఫ్ 88వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక ఐకె ఒలంపియాడ్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో నిర్వహించిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. ఏఐఎస్ఎఫ్ పోరాటాలకు వేదిక కానుందన్నారు. విద్యార్థులకు నేటికి సక్రమంగా పాఠ్యపుస్తకాలను అందించలేకపోతుండడం దారుణమన్నారు. కేంద్ర-రాష్ట్రప్రభుత్వాలు విద్యరంగాన్ని నాశనం చేస్తున్న చర్యలను ఆపాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేయక తప్పదన్నారు. ఐకె ఒలంపియాడ్ పాఠశాల కరస్పాండెంట్ ఇషాక్‌ఖాన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, సిపిఐ నేతలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


మాట్లాడుతున్న ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి

పుల్లంపేట: పుల్లంపేటలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నందు శుక్రవారం ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో బదిలీలపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల అభివృద్ధికి చేసిన కృషి మరువలేనిదన్నారు. తహశీల్దార్ నరసింహకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

5,10వ వార్డులు ఏకగ్రీవం


పాలినేని మాతమ్మ


తంగాల వెంకటరత్నం

గాలివీడు : మండల కేంద్రంలోని 5వ వార్డులో పాలినేని మాతమ్మ, 10వ వార్డు తంగాల వెంకటరత్నం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు శుక్రవారం తెలియజేశారు. ఈ రెండు వార్డులను గాను ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో పోటీ లేని కారణంగా అభ్యర్థులను ఏకగ్రీవం చేశామని అధికారులు స్పష్టం చేశారు.

బీకేఎంయూలోకి చేరిక

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు కామ్రేడ్ పండుగోల మణి ఆధ్వర్యంలో బీకేఎంయూలో 100 మంది పార్టీలో చేరి పార్టీ సభ్యత్వం తీసుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా బడుగు బలహీన వర్గాల వారి సమస్యలపై అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయు ఆధ్వర్యంలో సభ్యత్వం తీసుకున్నట్టు తెలియజేశారు. బీకేఎంయూ కోడూరు పట్టణ కార్యదర్శి షేక్ షహన్నా, హజ్మా, సన్నీ, నోసిన రామ య్య, సిగమాల వెంకటేష్, లక్ష్మీనరసయ్య, వెంకటరమణ, గంగమ్మ, మౌలాలి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజ

రాయచోటిటౌన్ : శ్రీ భద్రకాళీ అమ్మవారికి మహిళలు భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య స్వామి, కృష్ణస్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి రాహుకాల పూజలు నిర్వహించారు. ఈ పూజలలో భాగంగా అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి రంగు రంగుల పూజలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, నిమ్మకాయల హారాలతో అందంగా అలంకరించి భక్తుల దర్శన ఏర్పాటు చేశారు. అలాగే భక్తులకు రాహుకాల పూజా విశేషాలు నిర్వహించారు.

సెలవురోజుల్లో తరగతులా!

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, కోచింగ్ సెంటర్లపై కఠినచర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక డైట్‌పాఠశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ సెలవు దినాల్లో సైనిక్, నవోదయ కోచింగ్ సెంటర్‌లు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో ఐఎఫ్ఎస్ జిల్లా సహాయకార్యదర్శి సాయికుమార్,ఎస్ఎఫ్ఐ నేతలు చందు, నాగార్జున, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పండుగలా నా భూమి.. నా దేశం

రామాపురం : రాష్ట్రంలో నా భూమి నాదేశం కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని సుద్దమళ్లలో చేపట్టిన నా భూమి నా దేశం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, స్థానిక అమరవీరుల పేర్లు గల శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల సంస్మరణార్థం మొక్కలు నాటారు. ఏపీఓ సురేంద్రరెడ్డి, నాగిరెడ్డి, ఆంజనేయులురెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, నాగశేఖర్‌రెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగం మరువలేనిది

రాయచోటి అర్బన్ : అమరవీరుల త్యాగం మరువలేనిదని మున్సిపల్ ఛైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాష అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఆజాదికా అమృత మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా అధికారులు, కౌన్సిలర్లు నాభూమి -నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యాలయం ఆవరణలో మొక్కలను నాటారు. వైస్‌ఛైర్మన్ ఫయాజుర్ రహిమాన్, వైఎస్ఆర్ సిపి నేతలు ఫయాజ్ అహమ్మద్, జానం రవీంద్ర, బుజ్జిబాబు, ఖాదర్‌వలీ, వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ పాల్గొన్నారు.


రాయచోటి మున్సిపల్ కార్యాలయంలో మొక్క నాటి నీరుపోస్తున్న మున్సిపల్ ఛైర్మన్

నాలుగు గ్రామాల్లో నా మట్టి-నా దేశం

చిన్నమండెం : మండల పరిధిలోని నాలుగు గ్రామాల్లో నా మట్టి నా దేశం నేలతల్లికి నమస్కారం వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీఓ రహీం తెలిపారు. కొత్తపల్లె ఎంపీపీ పాఠశాల, మల్లూరు సచివాలయం, దేవగుడిపల్లె కస్తూరిబా పాఠశాల, వండాడి గ్రామ సచివాలయాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వసుధకు వందనం, శిలాఫలకం ఆవిష్కరణ, పంచ్ ప్రాన్ ప్రతిష్ట కార్యక్రమాలను చేపట్టినట్లు ఎంపీడీఓ తెలిపారు.


రామాపురం: సుద్దమళ్ల గ్రామంలో శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

పిల్లల్లో దేశభక్తిని నింపాలి

రాయచోటిటౌన్: బాల్యం నుంచే విద్యార్థుల్లో దేశభక్తిని నింపాలని దిగువ అబ్బవరం గ్రామ సర్పంచ్ కేతినేని ప్రభావతమ్మ అన్నారు. శుక్రవారం నా భూమి నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నా భూమి - నా దేశం ద్వారా నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం అంటూ నినాదం చేశారు. ఎంపీడీవో మల్‌రెడ్డి, ఈఓపీఆర్‌టీ సురేష్ బాబు, మాజీ జవాన్లు పాల్గొన్నారు.


ఓబులవారిపల్లె: రాళ్లచెరువుపల్లె గ్రామంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ విజయారావు

అమరవీరులకు వందనం

ఓబులవారిపల్లె: నాదేశం....నేలతల్లికి నమస్కారం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని రాళ్లచెరువుపల్లె పంచాయతీలో సర్పంచ్ పోలి పాపిరెడ్డి, ఎంపీడీఓ విజయారావు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులను స్మరించుకోవాలన్నారు. అనంతరం అమరవీరులకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కలు నాటారు. ఉపాధిహామి ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బాలుర వసతి గృహం పరిశీలన

పుల్లంపేట: జిల్లా సాంఘిక సంక్షేమాధికారి జాకీర్ హుస్సేన్ శుక్రవారం స్థానిక పుల్లంపేటలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. వసతి గృహంలో ఉన్న ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వారు సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకుముందు రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలకు సంబంధించి బాలురు, బాలికల సంక్షేమ వసతి గృహాల వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జగనన్న విద్యా దీవెనకు సంబంధించి చర్చించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రెడ్డి, సుబ్బరాజు, ప్రేమ్ సాగర్ పాల్గొన్నారు.

పిల్లలకు టీకాలు వేయించాలి


ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ సందీప్

లక్కిరెడ్డిపల్లి: చిన్న పిల్లలకు నెలవారీ టీకాలు తప్పనిసరిగా వేయించాలని డబ్ల్యూహెచ్‌ఓ సందీప్ పేర్కొన్నారు. శుక్రవారం చౌటపల్లి విలేజ్ క్లీనిక్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా 0 నుంచి 5 ఏళ్ల పిల్లలకు టీకాలు ఎంతమందికి వేశా రని రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.సీహెచ్‌ఓ రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ కుమారి, ఏఎన్ఎం పాల్గొన్నారు.

మహిళలకు చేయూత

పెనగలూరు: రాష్ట్రంలో 1.25 కోట్ల మంది డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ రాయితీ లభించిందని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పెనగలూరు డ్వాక్రా సంఘాలకు సున్నా శాతం వడ్డీ రాయితీ చెక్కు అందజేసే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కోడూరు నియోజకవర్గానికి 44వేల మంది మహిళలకు రూ. 6.47 కోట్లు సున్నా వడ్డీ రాయితీ లభించిందని వారన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం రుణమాఫీ ఇస్తామని ప్రకటించి మహిళలను మోసం చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నవరత్నాలలో సున్నావడ్డీ లేకపోయినప్పటికీ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని వడ్డీని నేరుగా సంఘాలకు అందజేస్తున్నారన్నారు. అంతకు ముందు ఎంపీడీఓ వరప్రసాద్ పలు అంశాలపై వివరించారు. జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, మండల ఛైర్మన్ ఎల్ శ్రీనివాసులు రెడ్డి, జడ్పీటిసి సభ్యుడు సుబ్బరాయుడు, ఏపీఎం నిరంజన్, తహశీల్దార్ శ్రీధర్ రావు, స్త్రీనిధి ఏపిఎం రాజు, ఏపీఎంలు రవికుమార్, ఆర్ముగం, విఆర్‌ఓలు, గుండ్లూరు ఈశ్వరయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి : అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా, ప్రజల సుఖసంతోషాలే ధ్యేయంగా జగనన్న పాలన సాగుతోందని వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాయచోటి రూరల్ మండలం చెన్నముక్కపల్లె-1 సచివాలయ పరిధిలో శుక్రవారం రెండవ రోజు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, స్టేట్ సివిల్ సప్లైస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, మండల బీసీ నాయకుడు పల్లపు రమేష్, ఎంపీటీసీలు ప్రభాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డిలతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. పూలతోట హరిజనవాడ, చెన్నముక్కపల్లె, యానాది కాలనీ, కొలిమిమిట్టలలో ప్రతి ఇంటి గడపకు శ్రీకాంత్‌రెడ్డి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ సమస్యలపై ఆరా తీస్తూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గూర్చి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి అక్కడే ఉన్న అధికారుల ద్వారా పరిష్కార మార్గాన్ని చూపిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు లబ్ధి అందడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. సీఎంజగన్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

– దళితుల మనోభావాలను చంద్రబాబు, లోకేష్‌లు దెబ్బతీశారని పూలతోట హరిజనవాడ వాసులు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఎదుట గుర్తు చేసుకున్నారు. గతంలో దళితులలో ఎవరు పుట్టాలని కోరుకుంటారని మాట్లాడారని, ఇప్పుడు లోకేష్ దళితులు ఏమి పీకుతారంటూ మాట్లాడారని ఆ ప్రాంతాల ప్రజలు గుర్తు చేసుకున్నారు. అంతకుముందు ఎమ్మెల్యే పూలతోట దళితవాడలో ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను శ్రీకాంత్‌రెడ్డి సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మల్‌రెడ్డి, స్థానిక నాయకులు మురికినాటి వెంకటరామిరెడ్డి, జాఫర్‌ఆలీఖాన్, వెంకటరామిరెడ్డి, హరినాథరెడ్డి, శ్రీనివాసులు, సురేష్‌కుమార్‌రెడ్డి, దేవరాయలు, అప్పా వెంకట్రామయ్య, జిలానీ పాల్గొన్నారు.


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

జగనన్న పాలన స్వర్ణయుగం

ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

పెనగలూరు: రాష్ట్రంలో జగనన్న సంక్షేమ అభివృద్ధి పథకాలు స్వర్ణయుగాన్ని తలపిస్తున్నాయని ప్రభుత్వవిప్, శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సింగారెడ్డిపల్లి పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతోపాటు మండల వైస్ ప్రెసిడెంటు కొండూరు విజయ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. ప్రతి కుటుంబానికి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఎమ్మెల్యే ప్రతి కుటుంబం వద్దకు వెళ్లి బుక్ లేట్ అందిస్తూ, ప్రభుత్వ పథకాలు వివరిస్తూ అర్హులుగా ఉంటూ ఏవైనా పథకాలు అందుతున్నాయా లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఎవరైనా అర్హులుగా ఉండి ప్రభుత్వ పథకాలు అందకుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అంతకుముందు సింగారెడ్డిపల్లికి రాగానే వైఎస్సార్ సీపీ నాయకులు గుండ్లూరు శివకుమార్ ఘనంగా స్వాగతం పలుకుతూ గజమాలతో సత్కరించారు. కంబాలకుంట బీసీ కాలనీ, దళితవాడ, సింగారెడ్డిపల్లి గ్రామాలలో వారు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి జిల్లా అధ్యక్షులు పంజం సుకుమార్ రెడ్డి, పెనగలూరు మండల వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్ రెడ్డి, సుధాకర్ రాజు, పొందలూరు నీటిసంఘం అధ్యక్షులు గుడ్ల వీరనారాయణ రెడ్డి, పెనగలూరు వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు సిద్ధవరం శ్రీనివాసులు రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు సుబ్బరాయుడు, ముదిరాజ్ సంఘం రాష్ట్ర డైరెక్టర్ గుండ్లూరు ఈశ్వరయ్య, సింగనమల వైఎస్సార్ సిపి నాయకుడు మల్లికార్జున, సాతుపల్లి వెంకటేశు, ఎంపీడీఓ వరప్రసాద్, తహశీల్దార్ శ్రీధర్ రావు, ఏఓ పవన్ కుమార్, ఎంపీటీసీ చంద్రకళ, స్థానిక సర్పంచ్ ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.


సింగారెడ్డిపల్లిలో ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

ఈ-పంట నమోదు తప్పనిసరి

పెనగలూరు: పెనగలూరులో వ్యవసాయ సలహామండలి సమావేశాన్ని జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-పంటను నమోదు చేస్తేనే ప్రభుత్వ పథకాలు పొందేందుకు అర్హులవుతారన్నారు.వ్యవసాయ సలహామండలి మండల ఛైర్మన్ శ్రీనివాసులు రెడ్డి, ఏఓ పవన్ కుమార్, పశువైద్యాధికారి సురేష్, రైతు భరోసా సిబ్బంది హర్ష, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పంజం సుకుమార్ రెడ్డి

పిల్లల ఆలోచనలను ప్రోత్సహించాలి

రాజంపేట టౌన్: విద్యార్థుల అన్వేషణాత్మకమైన ఆలోచనలను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని ఎంఈఓ కొండూరు రఘునాథ్‌రాజు తెలిపారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం ఇన్‌స్పైర్ మనాక్, సైన్స్‌ల్యాబ్‌ల పనితీరు మెరుగుపై డివిజన్‌లోని సైన్స్ ఉపాధ్యాయులతో నిర్వహించిన ఓరియంటేషన్ ప్రోగ్రాంలో ఎంఈఓ మాట్లాడారు. మనిషి తన జీవితంలో నిత్యం ఎదుర్కొనే అనేక సమస్యలకు పరిష్కారంగా విద్యార్థి ఆలోచనల నుంచి పుట్టుకువచ్చే ప్రాజెక్టులను ఇన్‌స్పైర్ మనాక్‌కు నామినేట్ చేయాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి తప్పనిసరిగా ప్రాజెక్టులను నామినేట్ చేయాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు నామినేషన్లు, ఉన్నత పాఠశాలల నుంచి ఐదు నామినేషన్లను ఈనెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో సమర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి పాఠశాలలో ప్రాజెక్టు కాంపిటీషన్ నిర్వహించి మంచి ప్రాజెక్టులను ఎంపిక చేసి సబ్మిట్ చేయాలన్నారు. ఎంఈఓ-2 సుబ్బరాయుడు మాట్లాడుతూ విద్యార్థులను వ్యవస్థాపకులుగా మార్చే శక్తిసామర్థ్యాలు సైన్స్ ఉపాధ్యాయులకు మాత్రమే ఉందన్నారు. గతంలో రాజంపేట నుంచి అంతర్జాతీయ స్థాయికి ప్రాజెక్టులు ఎంపిక అయ్యాయని, అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా ప్రాజెక్టులను తయారు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం లక్షుమ్మ, రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి జిల్లా అకడమిక్ కో-ఆర్డినేటర్ రవిశంకర్‌రెడ్డి, రీసోర్స్ పర్సన్ లక్ష్మీనరసింహశాస్త్రీ, వెంకటసుబ్బయ్య, వరప్రసాద్ డివిజన్‌లోని ఏడు మండలాలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ రఘునాథ రాజు

ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ప్రారంభం

రైల్వేకోడూరు : మండలంలోని అనంతరాజుపేట గ్రామంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన పౌష్టిక ఆహారాన్ని, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. సేంద్రీయ వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తుల ద్వారా ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం పొందగలుగుతారన్నారు. అలాగే కిచన్‌గార్డెన్ కిట్స్‌ని పంపిణీ చేయడానికి ప్రణాళికను సిద్ధం చేశామని వివరించారు. జెడ్పీటీసీ రత్నమ్మ, బొజ్జవారిపల్లె సర్పంచ్ సుబ్బయ్య, ఎంపీటీసీ బండారు మల్లిఖార్జున, మండల వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ వెంకటరెడ్డి, ప్రాజెక్ట్ రీసోర్స్ పర్సన్ ఉషారాణి, సుబ్బలక్ష్మి, కళ్యాణి, గంగమ్మ, మధు తదితరులు పాల్గొన్నారు.


వ్యవసాయ వనరుల కేంద్రం పారంభోత్సవంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజంపేట రూరల్: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ డీఈఈ ఎం సురేంద్రనాథ్ తెలియజేశారు. స్థానిక డివిజన్ విద్యుత్‌శాఖ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాజంపేటలోని 220 కెవిఎస్ఎస్, 33 కెవి, 11 కెవి, విద్యుత్ లైన్లకు సమీపంలో ఉన్నటువంటి చెట్లు తొలగించే కార్యక్రమం శనివారం చేపట్టామన్నారు. రాజంపేట పట్టణంతో పాటు మండలంలోని తాళ్ళపాక, ఆకేపాడు, బ్రాహ్మణపల్లి, బావికాడపల్లి, హెచ్ చెర్లోపల్లి, కట్టకిందపల్లి, కొండ్లోపల్లి, మందరం, పుల్లంపేట మండలంలోని పీవీజీ పల్లి, దొండ్లోపల్లి, బావికాడపల్లి, వత్తలూరు, రెడ్డిపల్లి, పెనగలూరు మండలంలోని పెనగలూరు, కొండూరు, టి.జి.పల్లి, బెస్తపల్లి సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలియజేశారు.

ఫ్యాన్లు వితరణ

రైల్వేకోడూరు అర్బన్ : వీపీఆర్ కండ్రిగ గ్రామం సమీపంలోని శ్రీ సాయి ఈశ్వరమ్మ వృద్ధాశ్రమానికి శుక్రవారం ఫ్యాన్లు వితరణ చేశామని వాసవీక్లబ్ అధ్యక్షుడు సుమన్ తెలిపారు. అలాగే వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద సిమెంట్ బెంచిని ఏర్పాటు చేశామన్నారు. వాసవీక్లబ్ జిల్లా గవర్నర్ సుధాకర్, రీజనల్ ఛైర్మన్ విజయ్‌కుమార్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

రైల్వేకోడూరు : పట్టణంలోని తేజ కళ్యాణ మండపంలో శుక్రవారం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై వెంకటేశ్వరస్వామి కళ్యాణం అంగరంగవైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణాల మధ్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానము ఆలయ ధర్మకర్త బండాత్మకూరు సుదర్శన శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు మణికంఠ శర్మ ఆధ్వర్యంలో కల్యాణ వేడుక జరిగింది. ఆలయం వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు కమిటి సభ్యులు నిర్వహించారు.


కల్యాణోత్సవ దృశ్యం

ప్రిన్సిపాల్‌గా నాగరాజునాయుడు బాధ్యతల స్వీకరణ

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు మండలం కె.బుడుగుంటపల్లె పంచాయతీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నూతన ప్రిన్సిపాల్‌గా నాగరాజు నాయుడు బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్‌ను కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.


ప్రిన్సిపాల్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

-ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు(రాజంపేట): ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నందలూరు మండలాధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం టంగుటూరులో పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయి నుంచి మండల స్థాయి వరకు జగనన్న ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి,సంక్షేమం గురించి తెలియచేయాలన్నారు. ప్రతిపక్షాల అనవసరంగా ప్రభుత్వంపై బురదచల్లే కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 2024 ఎన్నికల్లో కూడా ఆశీర్వదించుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ముదిరాజ్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టరు లక్ష్మీనరసయ్య, సర్పంచి మైనుద్దీన్, మండల నేత అన్నంనాగేంద్ర, జెసిఎస్ కన్వీనరు మురహరి షావలి, ఆంజనేయులు పాల్గొన్నారు. అంతకు ముందు టంగుటూరు స్కూల్‌ను ఎంపీపీ తనిఖీ చేశారు. మేరామట్టి, మేరా దేశ్‌లో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి


ఎస్ఐగా బాధ్యతల స్వీకరణ

సిద్దవటం: సిద్దవటం నూతన ఎస్ఐగా సి.లక్ష్మనారాయణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ తులసీ నాగప్రసాద్ కడపకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో వీరపనాయునిపల్లె మండలం నుంచి బదిలీపై వచ్చిన ఎస్ఐ లక్ష్మీనారాయణ సిద్దవటం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ చంద్రానాయక్, పోలీసులు పాల్గొన్నారు.


ఎస్ఐ లక్ష్మీనారాయణ

డిజిటల్ విద్యకు శ్రీకారం

సంబేపల్లె : విద్యార్థులకు అత్యున్నత స్థాయి బోధన ద్వారా గ్లోబల్ సిటిజన్లుగా తీర్చిదిద్దడానికి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిజిటల్ విద్యకు శ్రీ కారం చుట్టినట్లు ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం 6వ తరగతి నుంచి 10 వతరగతి వరకు ఉన్న తరగతి గదుల్లో 9 ఇంటరాక్టీవ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పి) ను, 3 నుంచి 5 వతరగతి వరకు ఉన్న గదుల్లో మూడు స్మాట్ టీవీలను అమర్చారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ కష్టమైన పాఠ్యాంశాలు విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేందుకు డిజిటల్ విద్య తోడ్పతుందన్నారు.



పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

వీరబల్లె (రాయచోటిటౌన్): ట్రిపుల్‌ఐటీకీ ఎంపికైన పేద విద్యార్థినికి జిన్నా సేవా సంస్థ సభ్యుడు జిన్నా షరీఫ్ రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. వీరబల్లె మండలం ఓదివీడు కస్పాకు చెందిన చింతమాని తిమ్మయ్య రెండవ కుమార్తె శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యింది. అక్కడికి చేరేందుకు కూడా ఆర్థిక స్తోమత లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఆయన వారి ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అందించారు.


ఆర్థికసాయం చేసి విద్యార్థి తండ్రితో మాట్లాడుతున్న జిన్నా షరీఫ్